

మీడియా రైటింగ్‌పై కొత్త పుస్తకం

మహిళావర్సిటీలో "రైటింగ్ ఫర్ న్యూస్ పేపర్స్, రేడియో అండ్ వీడియో" అనే కొత్త పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. - 8లో



లక్ష్య సాధనపై ఫోకస్ ముఖ్యం

ఇంటర్ దశ విద్యార్థి జీవితంలో కీలకమని, బాగా చదివితే అత్యున్నత స్థాయికి చేరవచ్చని మహిళా వర్సిటీ వీసీ ఉమ అన్నారు. - 8లో



10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

అన్నమయ్య జిల్లాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

డిగ్రీ అడ్మిషన్ల కథ కంచికేనా!

తిరుపతి సిటీ: ఉన్నత విద్యామండలి విద్యార్థుల జీవితాలతో ఆడుకుటోంది. డిగ్రీ అడ్మిషన్ల కథ కంచికేనా అంటూ విద్యార్థులు మండిపడుతున్నారు. ఈనెల 13వ తేదీన డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని స్పష్టంచేసింది. సాంకేతిక కారణాలతో 15వ తేదీకి వాయిదా వేసింది. కానీ 18వ తేదీ వస్తున్నా ఇప్పటివరకు సీట్ల కేటాయింపుపై స్పష్టత ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియను చేపట్టకపోవడంతో ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓఏఎమ్‌డీసీ ఆన్‌లైన్ ప్రక్రియ సక్రమంగా కొనసాగించకపోవడంతో పాటు ఉన్నత విద్యామండలి అధికారులు నిద్రావస్థలో కొనసాగుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని మేధావులు, అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా డిగ్రీ ప్రవేశాలపై ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకోకపోవతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథిగృహం వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,607 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,856 మంది భక్తులు తల నీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.87 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామివారిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వ దర్శనం టోకెన్లు కలిగిన వారు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

11వేలు దాటని దరఖాస్తులు

తిరుపతి సిటీ: యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశాల దారుణంగా పడిపోయాయి. ఈనెల 15వ తేదీ వరకు పీజీసెట్-2025 కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌కు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది. కానీ ఆ తేదీకి 32వేల సీట్లకు గాను కేవలం 9వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో మరోమారు 17వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవకాశం కల్పించారు. కానీ బుధవారం వరకు కేవలం మరో 3వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రధానంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 వర్సిటీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో సుమారు 32వేలకు పైగా ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ సీట్లు ఖాళీలు ఉండగా ఇప్పటికే కేవలం 11వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ మేరకు నాగార్జున వర్సిటీ పీజీ సెట్ కౌన్సెలింగ్ కన్వీనర్ తెలిపారు. మరో మారు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఉన్నత విద్యా మండలి అవకాశం ఇవ్వకుంటే కనీసం 20శాతం సీట్లు సైతం వర్సిటీల్లో భర్తీకి నోచుకోవని వర్సిటీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎస్వీయూ పరిధిలో సుమారు 3వేల సీట్లు ఉండగా బుధవారం సాయంత్రం నాటికి కేవలం 1,012 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

శివార్లు.. శివాలెత్తుతున్న భూచోళ్లు

అవిలాల సర్వే నంబరు 481లో మఠం భూములను చదును చేస్తున్న జేసీబీ (ఫైల్)



సాక్షి ఫోకస్

ఆధ్యాత్మిక నగరం తిరుపతి విస్తరించడంతో శివారు ప్రాంతాల భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇక గత ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎల్లో నేతలు శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములపై గద్దల్లా వాలిపోతున్నారు. కోట్లరూపాయల విలువైన భూములను కాజేసేందుకు 'భూ' చోళ్లు బరితెగించారు. పక్కా సెటిల్‌మెంట్ భూములు ఖాళీగా ఉన్నా సరే 'పచ్చ' జెండా పాతేస్తున్నారు. మఠం భూములు.. కాలువలు, కుంటలు, గుట్టల గురించి చెప్పాల్సిన పనే లేదు. విదేశాల్లో ఉంటూ తిరుపతి పరిసరాల్లో భూములు కొనుగోలు చేసిన ఎన్‌ఆర్ఐలు సైతం తమ భూములను కాపాడండి మహాప్రభో అంటూ సెల్ఫీ వీడియోల్లో దండం పెట్టి అడుక్కుంటున్నారు.

తిరుపతి మహానగర శివార్లలో భూకబ్జాల పర్వం

- ఖాళీగా కనిపిస్తే జెండా పాతేస్తున్న పచ్చతమ్ముళ్లు
- మఠం భూములు, కాలువలు, కుంటలు మాయం
- పట్టా భూములనూ వదలని తమ్ముళ్లు
- వందల ఎకరాలను ఆక్రమణకు గురవుతున్నా అడ్డుకునే దిక్కులేదు
- చేష్టలుడిగి చూస్తున్న రెవెన్యూ అధికారులు
- పలు గ్రామాల్లో ఆక్రమణదారులపై తిరగబడుతున్న ప్రజలు



పద్మగిరి కొండను పచ్చనేతల నుంచి కాపాడాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి టాస్క్‌ఫోర్స్ : తిరుపతి మహానగరానికి శివారు ప్రాంతాల్లో భూములు, స్థలాలు కొన్నవారు ఇప్పుడు భయంభయంగా వాటిని కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మునుపెన్నడూ చూడని విధంగా కూటమి ప్రభుత్వానికి చెందిన కొందరు పచ్చనేతలు ఖాళీ స్థలం ఏదైనా.. ఎవరిదైనా ఆక్రమించడమే పనిగా పెట్టుకున్నారు. తిరుపతి రూరల్ మండలం పరిధిలోని మఠం భూములు, కాలువలు, కుంటలు, చెరువులు, కొండలు, దరఖాస్తు పట్టా భూములతో పాటు సెటిల్‌మెంట్ భూములను కూడా భూచోళ్లు ఆక్రమిస్తున్నారు. మఠం భూములను కాపాడాల్సిన మఠాధికారులు అడ్డుకునేందుకు వస్తే ఇనుప రాడ్లు, గునపాలతో చంపడానికి కూడా వెనుకాడడం లేదన్న ఆరోపణలు మఠం అధికారుల నుంచే వస్తున్నాయి.. రెవెన్యూ అధికారులపై అధికార పార్టీ నేతల ఒత్తిడి అధికం కావడంతో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతాన్ని వారు ఎక్కడా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూఆక్రమణలకు రెవెన్యూ, పోలీసు అధికారుల అండ మెండుగా ఉండడంతో రూ.కోట్లు ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన భూములపై హక్కు కోసం అసలైన భూయజమానులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించింది.

ఎక్కడెక్కడ విలువైన భూములు దోచేశారంటే..

- ఓటేరు గ్రామ పంచాయతీ పరిధిలో రజకులకు కేటాయించిన దోబీఘాట్‌ను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తుంటే అక్కడి సర్పంచ్ లక్ష్మీ, ఆమె భర్త రాజాయాదవ్ స్థానికులతో కలసి అడ్డుకున్నారు.
- గాంధీపురం పంచాయతీ సర్వే నంబరు 13లో పక్క మండలానికి చెందిన ఓ టీడీపీ నేత సుమారు రూ.4 కోట్లు విలువైన 200 అంకణాల స్థలం ఆక్రమించి యథేచ్ఛగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేశారు. ఆ సమయంలో గ్రామంలో గొడవలు జరిగినప్పటికీ రెవెన్యూ అధికారులు, పోలీసులు ఏ మాత్రం స్పందించలేదు.
- అవిలాల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 481లోని 0.58 ఎకరాలు ప్రభుత్వ కాలువ భూమిని ఆక్రమణదారులు కబ్జా చేశారు. అలాగే సర్వే నంబరు 486లోని ప్రభుత్వ భూమి, దానికి ఆనుకుని ఉన్న హథీరాంజీ మఠం భూములను కాజేయడానికి జేసీబీలతో చదును చేశారు. ఆ విషయం రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా ఉపయోగం లేకపోవడంతో స్థానిక సర్పంచ్ వెంకటరమణ గ్రామస్తులను వెంట తీసుకెళ్లి అడ్డుకున్నారు.



తనపల్లి పద్మగిరి కొండకు ఆనుకుని ఓ నిరుపేద ఇంటి గోడను ధ్వంసం చేసిన పచ్చనేతలు (ఫైల్)

- వేదాంతపురం గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వే 214లో 0.55ఎకరాల కాలువ భూమిని పచ్చపార్టీకి చెందిన నాయకులు కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేస్తున్నారు. దోబీఘాట్‌కు కేటాయించిన భూమిని కాజేస్తున్నారని ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు.

నిత్యం భూ వివాదాలే..

తిరుపతి రూరల్ మండలం పరిధిలోని అవిలాల, గాంధీపురం, పేరూరు, మల్లంగుంట, తనపల్లి, దుర్గసముద్రం, తిరుచానూరు, దామినేడు, పద్మావతిపురం, శ్రీనివాసపురం, ఓటేరు, తుమ్మలగుంట, రామానుజపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ భూములు, మఠం భూములు ఆక్రమణదారుల వశమవుతున్నాయి. ప్రతిపక్ష పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు నిరసనలు వ్యక్తం చేస్తున్నా రెవెన్యూ అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో తహసీల్దారుపై ఎంపీటీసీలు ప్రశ్నలతో ముప్పేట దాడులు చేస్తున్నా ఆయన మిన్నకుండి పోతున్నారు తప్పా నోట మాట రావడం లేదు.



పేరూరు పంచాయతీ సర్వే నంబరు 529/4లో ఆక్రమణలను అడ్డుకోవాలని ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు (ఫైల్)

- పేరూరు గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబరు 529/4ఏలో 0.98 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు రాత్రికి రాత్రి మట్టితో కప్పి చదును పనులు పూర్తి చేసి ప్రహరీ నిర్మాణం చేపట్టగా స్థానిక సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి స్థానికులతో కలసి అడ్డుకున్నారు.
- చిగురువాడ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 274లో స్వర్ణముఖి నదిని ఆక్రమించి అతి పెద్ద షెడ్డు నిర్మాణం చేపట్టిన భూఆక్రమణదారులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు.
- తనపల్లి పద్మగిరి కొండ (సర్వే నంబరు 263)ను తవ్వి అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేశారు. ఆ అక్రమ కట్టడాలకు అడ్డుగా ఉన్న ఓ నిరుపేద ఇంటి గోడలు పచ్చ పార్టీ నేతలు దౌర్జన్యంగా కూల్చేశారు. ఇంత జరిగినా ఆ అక్రమ కట్టడాలను తొలగించకపోవడం గమనార్హం.
- చిగురువాడ దక్షిణపు కండ్రిగ సర్వే నంబరు 256లో నదీ పొరంబోకు స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్ వేసి ప్రహరీ నిర్మాణం పూర్తి చేసినా అధికారులు ఆక్రమణలను తొలగించని పరిస్థితి. కోట్లు విలువైన నదీ పొరంబోకు భూములను పట్టా భూములతో కలసి రిజిస్టర్ చేస్తున్నట్లు సమాచారం.



గాంధీపురం పంచాయతీ సర్వే నంబరు 13లో మఠం భూమిని చదును చేస్తున్న ఆక్రమణదారులు (ఫైల్)

- గాంధీపురం పంచాయతీ పరిధిలోని హథీరాంజీ మఠం భూముల్లో సర్వే నంబరు 13లో 1.09 ఎకరాల భూమిని టీడీపీకి చెందిన నేతలు ఆక్రమించగా స్థానిక సర్పంచ్ లక్ష్మీ ఆమె భర్త మన్నూరు శివ స్థానికులతో కలసి అడ్డుకున్నారు.

ఆక్రమణలపై ఆగని పోరాటాలు

తిరుపతి నగర శివార్లలోని విలువైన ప్రభుత్వ భూములు, మఠం భూములను కాజేస్తున్న ఆక్రమణదారులపై ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, స్థానిక ప్రజా ప్రతినిధులు అనునిత్యం పోరాటం చేస్తున్నా కబ్జాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇటీవల తిరుపతి రూరల్ మండలం ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి రాత పూర్వకంగా జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వ భూములు, మఠం భూములు, కాలువలు, కుంటలు, చెరువుల కబ్జాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే ఆరు నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. రూ.కోట్లు విలువైన మఠం భూములు, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతుంటే అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు.



ఆక్రమిత భూమిలో చేస్తున్న అక్రమ నిర్మాణాలను గ్రామస్తులతో వెళ్లి అడ్డుకుంటున్న సర్పంచ్ వెంకటరమణ (ఫైల్)



వేదాంతపురం సర్వేనంబరు 214లో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలు (ఫైల్)



చిగురువాడ దక్షిణపు కండ్రిగ సర్వే నంబరు 256లో స్వర్ణముఖి నది పోరంబోకు భూమికి ప్రహరీ నిర్మించిన దృశ్యం

శ్రీకాళహస్తి ఈవోకు కొనసాగింపు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి దేవస్థానం ఈవోగా బాపిరెడ్డి మరో ఎనిమిది నెలలు కొనసాగిస్తున్న బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గత సంవత్సరం అక్టోబరు 30న విధుల్లో చేరిన బాపిరెడ్డిని ఈఏడాది అక్టోబర్ 30 శ్రీకాళహస్తి ఆలయంలో విధుల నిర్వహణకు అప్పట్లో ఉత్వర్వులు ఇచ్చారు. కాగా ఆయన పదవీ కాలం 2026 జూన్ వరకు కొనసాగిస్తూ తాజాగా ఉత్వర్వులు జారీచేసింది.

మహావిష్ణువు విగ్రహం వద్ద బందోబస్తు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుపతి అలిపిరి బాలజీ బస్‌స్టేషన్ సమీపంలో పడవేసిన మహావిష్ణువు విగ్రహం వద్ద బుధవారం టీటీడీ అధికారులు పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. విగ్రహం వద్ద మందుబాబులు పడవేసిన మద్యం బాటిళ్లతో పరిసరాలు అపవిత్రంగా చోటుచేసుకున్న అంశం వెలుగుచూడడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పడవేసిన విగ్రహం వద్దకు ఆకతాయిలు, మందుబాబులు, అసాంఘిక శక్తులు వంటివి రాకుండా భద్రతా చర్యలు చేపట్టారు.

తుడా ప్లాట్ల వేలం పొడిగింపు

తిరుపతి తుడా: రేణిగుంట-తిరుచానూరు హైవే సమీపంలో సూరప్పకశం వద్ద శ్రీ పద్మావతి నగర్ లేఔట్‌లో ప్లాట్లకు సంబంధించి 13వ విడత ఈ-వేలానికి సంబంధించి ఈనెల 24 వరకు పొడిగిస్తున్న తుడా చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 103 ప్లాట్లు అమ్మకం జరిగి సుమారు రూ.37 కోట్ల 80 లక్షలు తుడాకు ఆదాయం లభించిందన్నారు. దీంతో 17వ తేదీన ముగియనున్న ఈ-వేలంను 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చదరపు గజం రూ.14 వేల రూపాయలు నిర్ణయించారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏపీఎస్పీడీసీఎల్ ఉద్యోగులకు పదోన్నతులు

తిరుపతి రూరల్: ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న ఉన్నతాధికారులకు పరిపాలన పరమైన సౌలభ్యం కోసం పదోన్నతులు కల్పిస్తూ సీఎండీ సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు సూపరింటెండెంట్ ఇంజినీరు పి.సురేంద్ర నాయుడుకు చీఫ్ ఇంజనీరుగా పదోన్నతి కల్పించి సి.జి.ఎం (ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్) విభాగానికి బదిలీ చేశారు. అకౌంట్స్ విభాగం జనరల్ మేనేజర్ ఎం.మురళీకుమార్‌ను చీఫ్ జనరల్ మేనేజర్‌గా, అకౌంట్స్ విభాగంలో పేఆఫీసర్ ఎం.గాయత్రి భాయ్‌కి జనరల్ మేనేజర్‌గా, ఎం.ఉమాపతికి సూపరింటెండెంట్ ఇంజినీరు నుంచి చీఫ్ ఇంజినీరుగా పదోన్నతి కల్పించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.వెంకటసుబ్బారావు, వి.చంద్రశేఖర్ రావు, టీ.ఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసులు, పి.భాస్కర్‌రెడ్డి, బి.జగదీష్, జె.మోసెస్, ఆర్.ప్రదీప్‌కుమార్‌లకు సూపరింటెండెంట్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పించారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



తిరుచ్చిపై అమ్మవార్లతో శ్రీవారు



పవిత్ర ప్రతిష్ట నిర్వహిస్తున్న వేద పండితులు

వడమాలపేట (పుత్తూరు) : అప్పలాయగుంటలోని టీటీడీ అనుబంధ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి శుద్ధి, తోమాల సేవ, అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. పద్మావతి, ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. తదుపరి యోగశాలలో హోమం, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

పవిత్రోత్సవాల్లో నేడు

పవిత్రోత్సవాల్లో రెండవ రోజైన గురువారం ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.11.30 గంటల నుంచి 12.30 మధ్య స్వామి,అమ్మవార్లకు పవిత్రాలు సమర్పిస్తారు.

ట్రయల్ రన్ విజయవంతం



సూర్యప్రభ వాహనం ట్రయల్ రన్ నిర్వహిస్తున్న టీటీడీ అధికారులు

తిరుమలలో అధికారులు బుధవారం సూర్యప్రభ వాహనం ట్రయల్ రన్ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో వినియోగించే సూర్యప్రభ వాహనం పటిష్టతను పరిశీలించేందుకు ఈ ట్రయల్ రన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. వాహనం అంతా బాగుందని బ్రహ్మోత్సవాల్లో విజయవంతంగా వినియోగించవచ్చునని తెలియజేశారు. – తిరుమల



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.113,690
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.1,0,240

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,32,300
రిటైల్ వెండి గ్రాము	రూ.135.30

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



ప్రభుత్వం తప్పులను, ప్రజా సమస్యలను ఎత్తిచూపి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రికలపై అక్రమ కేసులు బనాయించడం తగదు. పత్రికా స్వేచ్ఛను హరించే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. సాక్షి పత్రికతో పాటు , టీవీ ఛానళ్ల, విలేకరులపై అక్రమ కేసులును తక్షణం వెనక్కి తీసుకోవాలి. కక్ష సాధింపు చర్యలను విడనాడాలి. అవసరమైతే ప్రచురించిన వార్తలో వాస్తవం లేకపోతే ఖండించాలి తప్ప ఇలా అక్రమ కేసులు బనాయించడం సరికాదు.

– వందవాసి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి



ప్రభుత్వాన్ని విమర్శించడం నేరం కాదు



రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛలో భాగమే పత్రికా స్వేచ్ఛ. అలాంటి పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించటం అంటే రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. 'జర్నలిస్ట్ ల పై క్రిమినల్ కేసులు పెట్టడం మానుకోవాలి. భావప్రకటన స్వేచ్ఛ కు విఘాతం కలిగించ రాదు.' అని సుప్రీం కోర్టు ప్రభుత్వాలను ఇటీవల హెచ్చరించింది. 'ప్రభుత్వాన్ని విమర్శించడం నేరం కాదని కూడా సుప్రీం కోర్టు మరొక కేసులో స్పష్టం చేసింది. సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డిపై పెట్టిన కేసులను కూటమి ప్రభుత్వం ఉప సంహరించుకోవాలి.

– రాఘవ శర్మ, సీనియర్ జర్నలిస్ట్, తిరుపతి

క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న శ్రీరంగం మఠ పీఠాధిపతి



శ్రీవారి ఆలయ ధ్వజస్తంభం వద్ద శ్రీరంగం మఠ పీఠాధిపతి వరాహ మహాదేశికన్ స్వామీజీ

తిరుమల: శ్రీరంగం మఠ పీఠాధిపతి వరాహ మహాదేశికన్ (అండవన్) స్వామీజీ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల బేడీ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మీడియా రైటింగ్‌పై కొత్త పుస్తకం

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ''రైటింగ్ ఫర్ న్యూస్ పేపర్స్, రేడియో అండ్ వీడియో'' అనే కొత్త పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించింది. ఈ పుస్తకాన్ని కమ్యూనికేషన్, జర్నలిజం విభాగం ప్రొఫెసర్ బీఎస్ నీలిమ రచించారు. ప్రొఫెసర్ నీలిమ ఇప్పటికే రచించిన రెండు రచనలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. తాజా ప్రచురణ, పత్రికలు, రేడియో, టెలివిజన్ మీడియా జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులకు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఆ పుస్తకాన్ని వర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ బుధవారం ఆవిష్కరింగా రిజిస్ట్రార్ రజని కొత్త పుస్తకాన్ని అందుకున్నారు.

ఎర్రచందనం కేసులో నలుగురికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లను నరకడానికి ప్రయత్నించిన కేసులో నలుగురికి ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి ఎస్.శ్రీకాంత్ బుధవారం తీర్పుచెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ బాబు ప్రసాద్, ఎఫ్ఆర్ఓ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. 2012 సెప్టెంబర్ 25వ తేదీ అన్నమయ్య జిల్లా, సానిపయ్య రేంజ్ ఫారెస్ట్ సిబ్బంది పింఛా సెక్షన్, దిన్నెల బీట్, ముడంపాడు, అమ్మ బావి అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కేవీ పల్లి మండలం, నూతన కాల్వకు చెందిన సంగటి రమణయ్య, ఎర్రి మల్లయ్య, తుమ్మల శివ మల్లయ్య, వైవీ పాలెం మండలం, ఉస్తికాయల పెంటకు చెందిన బి.మల్లికార్జున్ ఎర్రచందనం చెట్లను నరకడానికి ప్రయత్నిస్తుండగా ఫారెస్ట్ సిబ్బంది వారిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నలుగురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శాంతి వాదించారు.

డబ్బున్నోళ్లకేనా వైద్య విద్య?

- పేదలకు ఉచిత వైద్య విద్య అందించేందుకే జగనన్న హయాంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం
- నాడు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు
- మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు కుట్రలు
- ప్రైవేటు పరం కాకుండా ఉద్యమ పోరాటాలు చేపడతాం
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ భూమన అభినయ్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ''వైద్య విద్య కేవలం డబ్బున్నోళ్లకేనా? ప్రతిభ ఉన్నా, పైసలు లేకపోతే వైద్య విద్య అభ్యసించే అర్హత పేద విద్యార్థులకు ఉండదా? చంద్రబాబూ'' అంటూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ భూమన అభినయ్ రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఏనాడు పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడంలో చంద్రబాబుకు ఎందుకంత చిన్నచూపు అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ప్రతిభ కలిగిన ప్రతి పేద విద్యార్థి వైద్య విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో జగనన్న రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మించారన్నారు. అందులో ఐదు కళాశాలలు నిర్మాణం పూర్తయి అడ్మిషన్ల దశకు చేరుకున్నాయన్నారు. మిగిలిన పది కళాశాలలు కూడా వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, వాటికి రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తే పూర్తయిపోతాయన్నారు. అలా చేయకుండా జగనన్న స్థాపించిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరంచేసి పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా చేయడానికి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు.

వేల కోట్లు మింగేసేందుకు చంద్రబాబు కుట్రలు

మెడికల్ కళాలలను ప్రైవేటుపరం చేసి వేల కోట్ల రూపాయలు మింగేసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరకాలంలో సుమారు రూ.2.15లక్షల కోట్లను చంద్రబాబు అప్పుగా తెచ్చి దేనికి ఖర్చు చేశారని ప్రశ్నించారు. లక్షల కోట్లను అప్పు చేస్తున్న చంద్రబాబు కేవలం రూ.6వేల కోట్లను ఖర్చుచేసి పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను అందించలేరా? అని ప్రశ్నించారు. అవి పూర్తయితే జగనన్నకు మంచిపేరు వస్తుందనే అక్కసుతో మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులు లక్షలాది రూపాయలు దోచుకుంటే.. జగనన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యాన్ని అందించి ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టారని గుర్తుచేశారు. అలాంటి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం ఏమిటని ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీ ఉద్యమ పోరాటాలు

పేదలకు ఉచిత వైద్య విద్య అందించేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమ పోరాటాలు చేపడుతామని చెప్పారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ 19వ తేదీన మదనపల్లె మెడికల్ కళాశాల వద్ద పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

భూమన కేసులకు భయపడే వ్యక్తి కాదు

ఎమర్జెన్సీ సమయంలో దేశంలోనే అతి పిన్న వయసులో రెండేళ్ల జైలుకు వెళ్లిన వ్యక్తి భూమన కరుణాకరరెడ్డి అని అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై, ప్రజా సంక్షేమం కోసం అనేక ఉద్యమ పోరాటాల్లో అనేక కేసులు పెట్టినా భయపడని నాయకుడు కరుణాకరరెడ్డి అని చెప్పారు. అలాంటి నాయకుడిపై టీటీడీ చైర్మన్, అధికారులు తప్పుడు కేసులు బనాయిస్తే భయపడతారా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లం రవికుమార్, జిల్లా, నగర అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, దినేష్‌రాయల్ పాల్గొన్నారు.

19న చలో మెడికల్ కాలేజీని విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తదితరులు

- పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రభుత్వ మెడికల్ కాలేజీల్ల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం
- వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, జగనన్న ప్రభుత్వంలో కట్టించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయాలని చూడడాన్ని అడ్డుకుంటామని వైఎస్ఆర్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి వెల్లడించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం యువజన విభాగం, విద్యార్థి విభాగం నేతలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన మదనపల్లెలో ప్రయివేటు పరం చేయనున్న మెడికల్ కాలేజీని సందర్శించి నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఆ నిరసనకు పెద్ద ఎత్తున విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు, యువజన విభాగం నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. జగనన్న ప్రభుత్వంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే ఆయనకు మంచిపేరు వస్తుందన్న అక్కసుతో ఒకటిన్నర సంవత్సరంగా పేద విద్యార్థులకు ఆ మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకురాకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఏడాదిన్నర కాలంగా ఆ కాలేజీలను ప్రారంభించకపోవడం వల్ల ఎంతో మంది పేద విద్యార్థులు మెడికల్ సీట్లు కోల్పోయారని, వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమా..? అంటూ ప్రశ్నించారు. జగనన్న చేసిన మంచిని కూటమి ప్రభుత్వం ఎంతో కాలం కప్పి పుచ్చలేరని, ఆ ప్రభుత్వంలో కట్టించిన కాలేజీలను వెలుగులోకి తీసుకురావడానికి వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం మెడికల్ కాలేజీల సందర్శనకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే జిల్లా నలుమూలల నుంచి వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు మదనపల్లె మెడికల్ కాలేజీకి వెళ్లి సందర్శించడం, అక్కడే వైద్య విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని బహిర్గతం చేయనున్నట్లు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వెల్లడించారు.

చలో మెడికల్ కాలేజీ పోస్టర్ల ఆవిష్కరణ

19న చలో మెడికల్ కాలేజీ పేరిట ముద్రించిన పోస్టర్లను చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆ పోస్టర్లను ప్రతి మండలంలో పార్టీ నేతలు, కార్యకర్తలకు తెలిసేలా పంపిణీ చేయాలని, 19వ తేదీన ప్రతి ఒక్కరు మదనపల్లె చేరుకుని పేద విద్యార్థులకు బాసటగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి ఓబుల్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శశిధర్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెంగల్ రెడ్డి, మండల అధ్యక్షుడు గూడూరు రఫీ, వినోద్ కుమార్, నక్క హరినాథ్ , శేష రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షులు ముని రెడ్డి, రామ్ తేజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు నరేష్, వెంకటరమణ నాయక్ , ప్రదీప్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: అన్నమయ్య జిల్లా కేవీ బావి అటవీ ప్రాంతంలో బుధవారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్ నేతృత్వంలో కోడూరు పరిధిలోని కేవీ బావి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున నొక్కోడి గుండం వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి అయితే వారు తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ఇద్దరూ తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. దుంగలతో పాటు వారిద్దరిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్ విచారించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రాజ్ కిరణ్ (ఫైల్)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద బుధవారం ద్విచక్ర వాహనాన్ని టాటా ఏస్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఒకటవ పట్టణ పోలీసుల కథనం మేరకు.. రేణిగుంటకు చెందిన రాజ్‌కిరణ్ (30), మహేష్ అనే యువకులు బుధవారం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం రేణిగుంటకు వస్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ద్విచక్రవాహన్ని ఢీకొనడంతో రాజ్‌కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు శవ పరీక్షల కోసం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టాటా ఏస్ డ్రైవర్ జగదీష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు లోకేష్

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలో బుధవారం సాయంత్రం ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో నివాసం ఉంటున్న చిట్టేటి వెంకటకృష్ణ, తులసి దంపతులకు చిట్టేటి లోకేష్ (7) అనే కుమారుడున్నాడు. వెంకటకృష్ణ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. తులసి మేనకూరు సెజ్‌లో కార్మికురాలిగా పనిచేస్తోంది. వీరిద్దరూ బుధవారం కుమారుడిని ఇంటి వద్ద వదిలి యథావిధిగా పనికి వెళ్లారు. సాయంత్రం వెంకటకృష్ణ ఇంటికి వచ్చేసరికి కుమారుడు లోకేష్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. నోటిలోంచి నురగ వస్తోంది. హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు పరిక్షించి అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గని కార్మికుల భద్రతే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎంఎస్ పెద్దిరెడ్డి రఘుపతి

- డీఎంఎస్ పెద్దిరెడ్డి రఘుపతి వెల్లడి


సైదాపురం: గని కార్మికుల భద్రతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ అడుగులు వేస్తోందని డిప్యూటీ మైన్స్ సేఫ్టీ నెల్లూరు రీజియన్ అధికారి పెద్దిరెడ్డి రఘుపతి వెల్లడించారు. మండలంలోని కలిచేడు గ్రామంలోని ఓకేషనల్ ట్రైనింగ్ కేంద్రంలో బుధవారం ఎలక్ట్రానిక్స్ డిటోనేటర్ వాడకంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో గనుల్లో ఎలక్ట్రికల్ డిటోనేటర్ అధికంగా వినియోగించేవారన్నారు. కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రికల్ డిటోనేటర్‌కు స్వస్తి పలికి ఎలక్ట్రానిక్స్ డిటోనేటర్‌ను వినియోగంలోకి తీసుకువస్తారని తెలిపారు. తద్వారా కార్మికుల భద్రతతో పాటు యాజమాన్యానికి కూడా పూర్తిగా రక్షణ ఉంటుందన్నారు. ఎలాంటి ప్రమాదాలు కూడా జరిగే అవకాశం లేదన్నారు. అందరు యాజమానులు ఇక నుంచి ఎలక్ట్రానిక్స్ డిటోనేటర్ ద్వారానే పనులను కొనసాగించాలన్నారు. అనంతరం వాడకంపై యాజమానులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీడీఎంఎస్ కిషోర్‌కుమార్, జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసరావు, సౌత్ ఇండియన్ మైకా మైన్స్ అధ్యక్షుడు మాగుంట ద్వారకానాథరెడ్డి, వివివి సర్వజ్ఞ కుమార కృష్ణ యాచేంద్ర, సురేష్‌రెడ్డి, ప్రణయ్‌కుమార్ రెడ్డి, బీ సుబ్బారెడ్డి, రాధకృష్ణ మైన్ ఏజెంట్ వసంతరావు, వీటీఓ రవిశంకర్, మేనేజర్లు వాసు, విశ్వం, శేఖర్‌నాయుడు, ఇస్మాయిల్, రంగారెడ్డి, మురగేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనపై ఫోకస్ ముఖ్యం

– ఎస్పీడబ్ల్యూ జూనియర్ కాలేజీ విద్యార్థినులకు వీసీ ప్రొఫెసర్ ఉమ ఉద్బోధ

తిరుపతి సిటీ: ఇంటర్మీడియెట్ దశ విద్యార్థి జీవితంలో కీలకమని, ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేస్తే అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ ఉద్బోధించారు. బుధవారం పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థి సంఘం ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడారు. జీవితంలో కౌమార దశ కీలకమని, ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో పెడదోవ పట్టించేవి వివిధ ఉపకరణాలు, మాధ్యమాలు ఉన్నాయని, అలాంటి వాటి వైపు ఆకర్షితులు కాకుండా లక్ష్యసాధనపై ఫోకస్ పెట్టి ముందుకుపోవాలన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షల్ని నెరవేర్చడమే ప్రధాన కర్తవ్యమని గుర్తెరిగి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. టీటీడీ డీఈఓ వెంకట సునీల్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలనే దృష్టితో విద్యార్థి సంఘాలను ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. టీటీడీ విద్యాసంస్థల ప్రతిష్టను ఇనుమడించేలా విద్యార్థులు అన్నింటా రాణించాలన్నారు. అనంతరం విద్యార్థి నాయకులకు అతిథుల చేతుల మీదుగా ధ్రువపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీ.భువనేశ్వరి, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ, టీటీడీ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతమ్మ, టీటీడీ విద్యాశాఖ సూపరింటెండెంట్ శివకుమార్‌ం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం



సమావేశానికి హాజరైన సీపీఎస్ నాయకులు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని టీటీడీ సీపీఎస్ ఉద్యోగుల ఫ్రంట్ నేత గోల్కొండ వెంకటేశం స్పష్టం చేశారు. బుధవారం తిరుపతిలో నిర్వహించిన సీపీఎస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడే వ్యతిరేకించామన్నారు. రెండు దశాబ్దాల కాలంలో మరణించిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ మాట్లాడుతూ, ఉద్యోగుల డబ్బుని షేర్ మార్కెట్లో పెట్టి ఉద్యోగుల జీవితాలతో ప్రభుత్వాలు ఆడుకుంటున్నాయని విమర్శించారు.

క్రైమ్ థ్రిల్లర్‌లా నాలుగు శవాల కేసు

- సంచలనంగా మారిన నాలుగు మృతదేహాల కేసులో అంతులేని అనుమానాలు
- మృతులెవరో తేలింది.. కానీ అసలు ఘటనకు కారణమేంటి ?
- పోస్టుమార్టంలో వెలుగులోకి వచ్చిన సంచలన విషయాలు
- జులైలో తన భార్య పిల్లలు కనిపించ లేదని ఫిర్యాదు చేసిన వెంకటేష్
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన తమిళనాడు పోలీసులు
- మిస్టరీ ఛేదించాల్సింది ఆంధ్రా పోలీసులే!



కలైసెల్వన్ (ఫైల్)



జయమాల (ఫైల్)

పాకాల : జిల్లాలోనే సంచలనంగా మారిన నాలుగు మృతదేహాల కేసు మిస్టరీ వీడట్లేదు. కేసు మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. ఈ నెల 14వ తేదీన పాకాల టోల్‌గేట్ సమీప ప్రాంతంలోని అడవిలో గుర్తించిన నాలుగు శవాలు చెన్నై వాసులుగా గుర్తించిన విషయం విదితమే. కేసు విచారణలో భాగంగా పాకాల పోలీసులు ఘటనా స్థలిలో దొరికిన ఆధారాలతో తంజావూరు ఆస్పత్రికి ఫోన్ చేసి డాక్టర్ రాసిన రశీదులో ఉన్న వివరాల ఆధారంగా ఆరాతీయగా కలైసెల్వన్‌తో పాటు మిగతా ముగ్గురు మృతుల వివరాలను అందించారు. సమాచారం అందుకున్న వెంకటేష్ మంగళవారం పాకాల పోలీస్టేషన్‌కు చేరుకుని తమిళనాడులో నాగపట్నం జిల్లా తిక్కచ్చేరి పోలీస్టేషన్‌లో తన భార్య, ఇద్దరు పిల్లలు తప్పిపోయినట్లు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఇందులో కలైసెల్వన్ తన భార్య పెద్దమ్మ కుమారుడని వెంకటేష్ తెలిపారు.

పోస్టుమార్టంలో తేలిందేమిటి ?

మృతదేహాలను పరిశీలించిన పోలీసులు మొదట్లో ఏదో ఆర్థిక ఇబ్బందుల వల్ల, లేక అనారోగ్య సమస్యలతో ఒకే కుటుంబానికి చెందిన వారు ఆత్మహత్య చేసుకుని ఉంటారని భావించారు. అయితే సోమవారం కలైసెల్వన్, జయమాల మృతదేహాలకు చేసిన పోస్టుమార్టంలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. ఇద్దరి నోట్లో గుడ్డలు కుక్కి ఆపై మూతికి ప్లాస్టర్ వేసినట్లు తేలింది. అలాగే మంగళవారం చిన్నారులు దర్శిణి, వర్షిణికి చేసిన పోస్టుమార్టంలో వర్షిణి నుదుటిపై పెద్ద గాయం, బ్రమిముకలు చిట్లడం, గొంతు వద్ద వాచినట్లు గుర్తించారు. కలైసెల్వన్ జయమాల, చిన్నారులను అడవిలోకి తీసుకొచ్చి చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడా ? లేక ఇంకా ఎవరైనా వీరిని అడవిలోకి తీసుకొచ్చి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా ? అనేది తేలాల్సి ఉంది.

పోలీసులతో కలసి అడవిలోకి వెంకటేష్

పోలీసులు కలై సెల్వన్, జయమాల మృతదేహాలకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మంగళవారం అక్కడే ఉన్న రెండు గుంతలను తవ్వి మృతదేహాలను పరిశీలించారు. అందులో ఆధార్‌కార్డులు, పాన్ కార్డులు, చిల్లర డబ్బులు, చాక్లెట్లు, ఒక ఫోన్ కనిపించాయి. దీన్ని పరిశీలించిన వెంకటేష్ చనిపోయింది తన భార్య జయమాల(33), పిల్లలు దర్శిణి(9), వర్షిణి(3) అని నిర్ధారించి మృతదేహాల వద్ద బోరున విలపించాడు. ఇప్పటి వరకు జరిపిన విచారణలో జయమాల.. తన భర్త అప్పుడప్పుడు పంపిన నగదును ఆమె పెద్దమ్మ కుమారుడు కలైసెల్వన్(38) కలసి ఫైనాన్స్ వ్యాపారం చేసినట్లు తెలుస్తోంది. అక్కడ కలైసెల్వన్‌పై చీటింగ్ కేసులు ఉన్నాయని, అక్కడ పోలీసులు అరెస్టు చేస్తారని పారిపోయినట్లు తెలిసింది. జయమాల తన భర్తకు ఏమి సమాధానం చెప్పాలో అర్థం కాక పిల్లలతో కలసి పారిపోయిందని వారి కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు.

తమిళనాడు పోలీసులు వైఫల్యమే కారణమా ?

జయమాల, ఇద్దరు పిల్లలు కనిపించడం లేదని జూలైలో తమిళనాడు పోలీసులకు ఫిర్యాదు అందితే రెండున్నర నెలలు గడిచినా పట్టుకోవడంలో విఫలమయ్యారు. ఎంతో అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నా తమిళనాడు పోలీసులు నిర్లక్ష్యం వల్లే నలుగురు మృత్యువాత పడ్డారనే విమర్శలు వస్తున్నాయి. ఆంధ్రా పోలీసులైనా కేసును వేగవంతం చేసి హత్యలా ? ఆత్మహత్యలా ?..మృతుల వెనక దాగి ఉన్న రహస్యాన్ని బయటపెట్టాలని కోరుతున్నారు.